## క్లుప్తంగా

### కమ్యూనిటీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి



ఇసుకపూడి దాసరివారిపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ భవనం

**అంబాజీపేట:** ఇసుకపూడి శివారు దాసరివారి పేటలో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ భవనానికి నిధులు కేటాయించి వినియోగం లోకి తీసుకురావాలని స్థానికులు కోరుతు న్నారు. 20 ఏళ్ల క్రితం సామాజిక భవనాన్ని నిధులు సరిపడక అసంపూర్తిగా నిర్మించి గాలి కొదిలేశారు. అప్పటి నుంచి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. అసంపూర్తిగా ఉన్న ఈ భవనం విని యోగంలో లేకపోవడంతో శిథిలస్థితికి చేరు తుంది. తక్షణమే భవన నిర్మాణానికి అవసర మైన నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

### 150 మందికి వైద్య సేవలు



మోరిపొలంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు

**మామిడికుదురు:** బీఆర్ అంబేడ్కర్ జయంత్యు త్సవంలో భాగంగా శనివారం ఆదుర్రు శివారు మోరిపొలంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ బళ్ల శ్రీనివాస రావు ప్రారంభించారు. మెడికల్ సర్వీస్ మాజీ డైరెక్టర్ టి.గీతాప్రసాదిని, అమలాపురం ఏరియా ఆస్పత్రి పీడియాట్రిక్ బి.జయరామ్‌జీ శిబిరాన్ని సందర్శించారు. రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరం ద్వారా లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యా ధికారులు రమ్య శైలజ, స్పందన సుమారు 150 మంది పిల్లలకు, పెద్దలకు వైద్య పరీక్షలు నిర్వ హించి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.శ్రీనివా సరావు, హెచ్‌వీ బి.జయకుమారి, ఏఎన్‌ఎం వైకేడీ నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్ భాను శ్రీ, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

### నిందితురాలి అరెస్ట్

**ఆత్రేయపురం:** స్థానిక చిన్నపేటకు చెందిన నక్కా మహాలక్ష్మి హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నక్కా బుజ్జమ్మను శనివారం ఆత్రేయపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల తొమ్మిదిన మహాలక్ష్మి హత్య జరగడం తో అప్పటి నుంచి పోలీసులు విచారణ చేపట్టి కోడలైన బుజ్జమ్మను నిందితురాలిగా పోలీ సులు గుర్తించారు. దీంతో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ నేతృత్వంలో పోలీసుల బృ ందం నిందితురాలిని కొత్తపేట కోర్టులో హాజ రుపరచగా నిందితురాలు బుజ్జమ్మకు జడ్జి రిమాండు విధించారు.

### భర్త వేధింపులపై భార్య కేసు

**అయినవిల్లి:** భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధిం చిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మం డలం తొత్తరమూడి జైభీమ్‌నగర్‌కు చెందిన కోరపు సావిత్రి, వెంకటరమణలకు 15 సంవత్స రాల కితం పెళ్లయింది. వీరికి ముగ్గురు కుమా ర్తెలు. కుటుంబ పోషణ నిమిత్తం సావిత్రి మూడేళ్ల క్రితం కువైట్ వెళ్లింది. అక్కడ సంపాదించిన సొమ్మును భర్త వెంకటరమణకు పంపించింది. భర్త వెంకటరమణ వేరే అమ్మాయితో అక్రమ సం బంధం పెట్టుకుని ఆమె సంపాదించిన సొమ్ము లను ఖర్చుపెట్టేశాడు. ఆమె ఇటీవల స్వగ్రామా నికి చేరుకుంది. ఈ నేపథ్యంలో వెంకటరమణ సావిత్రిని, ఆమె ముగ్గురు కుమార్తెలు వేధిం పులకు గురిచేస్తున్నాడని అయినవిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

**పి.గన్నవరం:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు అన్నారు. జి.పెదపూడిలంకలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం జరి గిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి విప్పర్తి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంగేటి అన్నవ రం, ఉప సర్పంచ్ చీకరమెల్లి వెంకట్రావు, వైఎ స్సార్ సీపీ యూత్ నాయకుడు కొండేటి వికాస్ బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

**అయినవిల్లి:** మండలంలోని నల్లచెరువులో కొలు వైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కి రిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు శ్రీని వాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరి పారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లిం చారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్ర సాదం స్వీకరించారు.

# పోషకాల పనస

- పువ్వులేకుండా పుట్టుకొచ్చే పండు
- ఎన్నో ఆరోగ్య సుగుణాలు



అంబాజీపేటలో విక్రయానికి ఉంచిన పనసకాయలు

**అంబాజీపేట:** వృక్షశాస్త్రంలో పువ్వు నుంచి పిందె, పిందె నుంచి కాయ, కాయ నుంచి పండు పుట్టు కొస్తూ ఉంటాయి. కాని పనస పండు చక్రం మాత్రం అలా జరగదు. ఈ చెట్టు మొదలు నుంచి చివరివరకూ ఎక్కడ నుండైనా కాండం నుంచే పిం దె పుట్టుకొచ్చి కాయలు, పండ్లు తయారవుతాయి. అందువల్లనే పనస చెట్టు నిండా కాయలు నిండి ఉంటాయి. అరమగ్గిన పనసపండు తినడానికే జీవించి ఉండాలనే నానుడి ఈ సీజన్‌లో నిజం చేస్తూ ఉంటుంది. సువాసనలు వెదజల్లుతూ నోరూరించే పనసపండు అంటే అందరికీ ఇష్టమే. సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడు అనాసకు ప్రతిగా పనసను సృష్టించాడంటారు. పనసపం డులో శరీరాగ్యోన్ని పెంపొందింపచేసే పలు పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండును ఆంగ్లంలో జాక్‌ఫ్రూట్ అంటారు. దీని వృక్ష శాస్త్ర నామ ధేయం ఎట్రోకార్పస్ ఇంటి గ్రిఫోలియా. మార్చి నుంచి జూలై వరకూ పనస చెట్టుకు బరువైన కాయలు వేలాడుతూ కనిపిస్తాయి. ఒక్కో చెట్టుకు 100 వరకూ కాయలు దిగుబడులు వస్తాయి. ఒక్కో కాయ పది నుంచి ఇరవై కేజీల బరువు ఉంటాయి. అయితే ఈ కాయలు ఎంత బరువున్నా అందులో 30 శాతం మాత్రమే తినడా నికి ఉపయోగపడుతుంది.

**పనసలో రకాలు..**

బంగారు పనస, కొబ్బరి పనస, ఖర్జూర పనస, వేరు పనస, చిన్నకోల పనస, గుండ్రు పనస, గులాబీ పనస, కర్ణపనస, తేనెపనస అనే రకాలు ఉన్నాయి. వివాహాది శుభ కార్యాలయాలకు అంద రికీ ప్రీతిపాత్రమైన పనసకాయ కూరకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ పనసకాయను పొట్టుగా కొట్టి వంటలకు ఉపయోగిస్తారు. అంతేకాకుండా లేత పనసకాయను చిన్న ముక్కలుగా తరిగి మసాల కూరలకు ఉపయోగిస్తారు.

**పనసలో పోషకాలు..**

పనసకాయలో ఉండే పోషకాలు చాలా విలువై నవని సీజన్‌లో దొరికే పండ్లను కచ్చితంగా తినాలని వైద్యులు పేర్కొంటున్నారు. మాంసకృ త్తులు 1.9 శాతం, చక్కెర పదార్థం 19.8 శాతం, కొవ్వులు 0.1 శాతం, కెరోటిన్ 175 మైక్రోగ్రా ములు, థియోమిన్ 0.3 మిల్లీ గ్రాములు, విటమిన్ సి 7 మిల్లీ గ్రాములు, పీచు పదార్థాలు 1.1 శాతం, సున్నం 20.0 మిల్లీ గ్రాములు, ఇనుము 0.56 మిల్లీ గ్రాములు లభిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**పనసంటే మక్కువ**



తింటే గారెలు తినాలి.. లేదా అంబాజీపేట పనస తినాలి అనే నానుడు పూర్వం నుంచి ఆచర ణలో ఉంది. మన రాష్ట్రం తో పాటు ఇతర రాష్ట్రాల వారు అంబాజీపేట పనస పండంటే ఎంతో మక్కువని పూర్వీకులు చెబుతున్నారు. పన సలో ఉండే రకాలన్నీ అంబాజీపేట చుట్టు పక్కల ప్రాంతాల్లోనే లభిస్తాయి. అంతేకాకుం డా పనస పంటపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటిని సంరక్షిస్తుంటారు.

– గంటి ప్రభు, అంబాజీపేట

**శరీర పుష్టి కలిగిస్తుంది**



పనస పండు దేహ పుష్టిని కలిగించి రక్తాన్ని వృద్ధి చేస్తుంది. మెదడు, నరాలు, కండరాలకు మంచి బలాన్ని కలిగిస్తుం ది. బాగా మగ్గిన పండు మనో ఉల్లాసాన్ని కలిగిస్తుంది. మూత్రాన్ని బాగా జారీ చేసి వాతాన్ని, పైత్యాన్ని నివారి స్తుంది. రోజూ పరగడుపున పనస తొనలను తినడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది.

– వి.గౌతమి, వైద్యాధికారి, అంబాజీపేట

### నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

**ఆత్రేయపురం:** గ్రామంలో వేంచేసిన గ్రామదేవత కనకమహా లక్ష్మి అమ్మవారి జాతరను బళ్ల సేవ పేరుతో ఆదివారం ఘనంగా నిర్వ హించడానికి ఆలయ కమిటీ నిర్వా హకులు ఏర్పాట్లు పూర్తి చేసి నట్లు తెలి పారు. ఇక్కడ శతాబ్దాలుగా గ్రామం ఏర్పడినప్పటి నుంచి బళ్లసేవ పేరుతో జాతరను ఘనంగా నిర్వ హించేవారు. పూర్వం నెల రోజుల పాటు జాతర నిర్వహించేవారని పెద్దలు చెబుతారు. నాడు వాహ నాలు లేని కాలంలో ఎడ్లబళ్ల యజమానులు అమ్మవారి జాతరను సొంత ఖర్చులతో గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించేవారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయాన్ని దాతల సాయంతో అత్యంత సుందరంగా నిర్మించారు. ఈ జాతరను వేసవికాలం మే నెలలో నిర్వహించడం ఆనవాయితీ.

# మళ్లీ సీఎంగా జగనే కావాలి

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- ఎల్.గన్నవరంలో గడప గడపకూ..



ఎల్.గన్నవరంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

**పి.గన్నవరం:** దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుతు న్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఎల్. గన్నవరంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సొసైటీ కమిటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, నాయకులు మాను కొండ ప్రసాద్, గనిశెట్టి గణపతి, చొల్లంగి చిట్టిబాబు తదితరులతో కలిసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారా నికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని చిట్టిబాబు అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కర్నాకుల సీతారామాంజనేయులు, మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, ఉలిశెట్టి బాబీ, పెమ్మాడి మారుతీకృష్ణమోహన్, కొక్కిరి రవికుమార్, మెల్లం మహలక్ష్మి ప్రసాద్, జల్లి పండు, బండి రమేష్ తదిత రులు పాల్గొన్నారు.

**200 రోజులు పూర్తి**



పి.గన్నవరంలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

**పి.గన్నవరం:** గడప గపడకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ప్రారంభించి 200వ రోజు పూర్తయిన సందర్భంగా ఎల్.గన్నవరంలో శనివారం ఆయన కేకును కట్ చేసి, కార్యకర్తలకు పంచారు. గ్రామానికి విచ్చేసిన నాయకులకు పార్టీ శ్రేణులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావే శంలో చిట్టిబాబు మాట్లాడుతూ, చంద్రబాబు, దత్త పుత్రుడు కలసి వచ్చినా సీఎం జగన్ మళ్లీ ఘన విజయం సాధిస్తారని చిట్టిబాబు అన్నారు. జెడ్పీ టీసీలు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మి, కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీను, నియోజకవర్గ పరిశీ లకులు కర్నాకుల సీతారామాంజనేయులు, నాయ కులు యన్నాబత్తుల ఆనంద్, వాసంశెట్టి చినబాబు, పి.సతీష్, మంగం చిట్టిబాబు, కారుపల్లి శ్రీను, కేతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### పెంటాథ్లాన్ పోటీల్లో క్రీడాకారిణి ప్రతిభ



కాంస్య పతకం సాధించిన కీర్తి

**అంబాజీపేట:** పెంటా థ్లాన్ టెట్రాటిల్ రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగ పోటీల్లో కె.పెదపూడికి చెందిన యర్రా కీర్తి ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించినట్లు పుల్లేటికుర్రు శేషశయన సాయి విద్యావనం కర స్పాండెంట్లు అయ్యగారి దుర్గామాధవి, కృష్ణసుందర్ తెలిపారు. స్థానిక విద్యావనంలో కీర్తిని పలువురు క్రీడాకారులు శని వారం అభినందనలు తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి టెట్రాటిల్ చాంపియన్ షిప్ పోటీలలో జూనియర్ విభాగంలో కీర్తి అత్యంత ప్రతిభ కనబర్చి కాంస్య పతకం కైవసం చేసుకుందన్నారు. వచ్చే నెల జూన్ 2న గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు కీర్తి ఎం పికైందని పీఈటీ జె.మోహనరావు తెలిపారు. కీర్తిని పలువురు అభినందించారు.

### విద్యార్థులకు ప్రోత్సాహం అభినందనీయం

**మలికిపురం:** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యార్థి సంఘాలు మెమెంటోలు ఇవ్వడం అభినందనీయమని డీఈవో ఎం.కమలకుమారి అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన రాజోలు నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులను వారు అభినందించారు. డీఈవో మాట్లాడుతూ విద్యారంగంలో వారిని చైతన్య పరిచి ప్రోత్సహించే దిశగా చొరవచూపడం పై కూడా సంఘాలను ఆమె అభినందించారు. సఖి నేటిపల్లి, మలికిపురం, రాజోలు మండలాల విద్యా శాఖాధికారులు, ప్రముఖ అంబేడ్కరిస్ట్ ఎంఏకే భీమారావు, విద్యార్థి సంఘ ఇన్‌చార్జులు దేవ రాజేం ద్రప్రసాద్, రాపాక మహేష్, పోలిశెట్టి గణేష్, తాడి సహదేవ్, తాడి రవీంద్ర, విద్యార్థి సంఘాల నాయ కులు మణికంఠ, నవీన్ పాల్గొన్నారు.

### లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం



రాజోలు కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి

**రాజోలు:** లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర పరిష్కారం లభిస్తుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలరాణి అన్నారు. శనివారం కోర్టు కాంప్లె క్స్‌లో నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో సుమారు రూ.43 లక్షలు విలువ చేసే కేసులను పరి ష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందులు రెండు బెం చ్‌లుగా కేసులను పరిష్కరించారు. లోక్‌అదాలత్‌కు విచ్చేసిన కక్షిదారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. లోక్‌అదాలత్ సభ్యులు రిటైర్డ్ ఎంపీడీఓ ఎల్‌వీ ప్రసాద్, న్యాయవాది ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

**కొత్తపేటలో..**

**కొత్తపేట:** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శని వారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 654 కేసులు పరిష్కరించారు. ఆయా కేసులకు సంబం ధించి రూ.12,01,750 సెటిల్మెంట్ చేశారు. జూని యర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అధ్యక్షతన జరి గిన లోక్ అదాలత్‌లో సీసీ ఎడ్మిషన్స్ కేసులు 628, సీసీ (జేపీసీ) కేసులు 16, పీసీసీ (బీఎస్ఎన్ఎల్) కేసులు 5, ఎన్ఐ యాక్ట్ కేసులు 2, ఫైనాన్స్ కేసులు 2, మెయింటెనెన్స్ కేసు 1 పరిష్కరించారు. కార్యక్ర మంలో లోక్ అదాలత్ సభ్యుడు అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆలమూరులో..**

**ఆలమూరు:** స్థానిక సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1527 కేసులు నమోదయ్యాయి. జడ్జి దివ్య దైవకృప ఆధ్వర్యంలో న్యాయసేవాధికార బృందం సభ్యులు సమక్షంలో ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జరిగింది. అందులో క్రిమి నల్ కేసులు 48, మనీ కేసులు 08, ఈపీ కేసులు 04, ఎన్ఐ యాక్ట్ కేసులు 08, ఎంసీ కేసులు 03, అడ్మిషన్ కేసులు 89, ఎస్‌టీసీ కేసులు 1359 కేసులు పరిష్కార మయ్యాయి. రూ.31.70 లక్షల అపరాధ రుసుం విధించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

### క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీ



ముక్తేశ్వరంలో క్లినిక్‌ను పరిశీలిస్తున్న వైద్యులు మంగాదేవి, వైద్య సిబ్బంది

**అయినవిల్లి:** మండలంలోని ముక్తేశ్వరంలో ఆర్ఎం పీ, పీఎంపీలకు చెందిన క్లినిక్‌లపై స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.మంగాదేవి, క్రిస్టఫర్‌లు శని వారం ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. ఆర్ఎంపీ, పీఎంపీ సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్నాయా లేదా, క్లినిక్‌లో రోగులకు అన్ని విధాలుగా సదుపాయాలు ఉన్నాయా లేదా అనే అంశాల్ని పరిశీలించారు. రోగులకు సిఫారస్సు చేసే మందుల వినియోగం వంటి అంశాలను పరిశీలించారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రభుత్వ సూచనలు పాటించాలని హెచ్చరించారు. వీరి వెంట హెల్త్ సూపర్‌వైజర్ పి.ప్రసాదరావు, హెల్త్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాస్ ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

### స్వామి సన్నిధిలో శ్రీధర్‌రెడ్డి

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్) సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు సిబ్బంది, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామి చిత్రపటం , ప్రసాదాన్ని సిబ్బంది ఆయనకు అందజేశారు.

### ఎన్నికల విజయంపై హర్షం

**అంబాజీపేట:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల సెంటర్‌లో స్వీట్లు పంచి, బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మలికిపురం:** కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై లక్కవ రానికి చెందిన పీసీసీ మెంబర్ రుద్రరాజు గోపాల కృష్ణంరాజు హర్షం వ్యక్తం చేశారు.

**మామిడికుదురు:** కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై మండల నాయకుడు గెద్దం వెంకటేశ్వరరావు ఆధ్వ ర్యాన బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు.

### వైభవంగా తాటమ్మ జాతర



తాటమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శక్తి వేషధారణలు

**పి.గన్నవరం:** గ్రామ దేవత తాటమ్మ వారి జాతర కన్నుల పండువగా జరుగుతుంది. శనివారం రాత్రి డీఎస్ పాలెం శెట్టిబలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మ వారిని గ్రామంలో ఊరేగించారు. గరగ నృత్యాలు, శక్తి వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఈనెల 19న అమ్మవారి తీర్థం జరుగుతుంది. కార్యక్రమాల్లో సంఘ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆంజనేయా.. అభయమీయవయా..

- నేడు హనుమజ్జయంతి
- గ్రామగ్రామాన ఘనంగా ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో కొత్తపేట బృహన్మూర్తి ఆంజనేయస్వామి

**కొత్తపేట:** శక్తిసామర్థ్యాలకు, కార్యదక్షతకు, విశ్వాసానికి, పట్టుదలకు ప్రతీక హనుమంతుడు. ఆయన అండగా ఉంటే దుష్టశక్తులు దరిచేరవన్నది భక్తుల విశ్వాసం. రాత్రి సమ యాల్లో బయటకు వెళ్లినప్పుడు దుష్టశక్తుల భ్రమలో భయ మేసినా, నిద్రలో పీడకలలు వచ్చినా ఆంజనేయస్వామిని తలుచుకోమని పెద్దలు చెప్పేవారు. రామాలయాల్లో సీతా, రామ, లక్ష్మణులతో పాటు వారి పాదాల చెంత ఆంజనేయ స్వామి ఉంటారన్నది అందరికీ తెలిసిందే. అంతేకాక గ్రామ గ్రామాన ప్రత్యేకంగా ఆంజనేయస్వామి వారి ఆలయాలు ఉంటాయి. పలు గ్రామాల్లో, ప్రధాన రహదారులు, జాతీయ రహదారుల పక్కన నిలెవెత్తు భారీ విగ్రహాలు దర్శన మిస్తాయి. ప్రధానంగా స్థానిక బోడిపాలెం సెంటర్‌లో పూర్వం ఆంజనేయస్వామి ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే స్థానిక సత్యాసెంటర్ కోదండరామ స్వామివారి ఆలయం (కొత్తరామాలయం) వద్ద కొన్నేళ్ల క్రితం బృహన్మూర్తి రూపంలో ఆంజనేయస్వామి రాతి విగ్ర హాన్ని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహానికి ప్రతీ మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, నిలువెత్తు పూలమాలతో పూజలు నిర్వ హిస్తారు. మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం వంతెన వద్ద కాలువగట్టున పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం తో పాటు భారీ నిలువెత్తు విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, భక్తుల పూజలందుకుంటంది. పలివెల ప్రధాన వీధిలో అభయాంజనేయస్వామి, వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద, వాడపాలెం చిన్న వంతెన వద్ద, మోడేకుర్రు గ్రామ ముఖ ద్వారంలో ప్రధాన రహదారి ప్రక్కన, మందపల్లి పెద్ద వంతెన వద్ద ఇలా గ్రామగ్రామాన ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాలు భక్తుల పూజలతో అలరారుతున్నాయి.

వైశాఖ బహుళ దశమి తిథి, శతభిషం నక్షత్రం పురస్కరిం చుకుని ఆదివారం హనుమజ్జయంతిని నిర్వహిస్తున్నారు. ఆయా ఆలయ పోషకులు, ఆలయ కమిటీలు, అర్చకుల ఆధ్వ ర్యంలో హనుమజ్జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాల వద్ద హోమాలు, అన్న సమారాధనలు, పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిం చనున్నారు.

**నేడు హనుమాన్ జయంతి**

**అంబాజీపేట:** మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించేందుకు ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. అంబాజీపేట పశువుల మార్కెట్‌లో అభయాంజనేయస్వామి, గంగలకుర్రు అగ్రహారం ముషిణివారిపాలెం హనుమాన్ జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి, పెద్దవీధిలోని నాగమల్లి చెట్టు వద్ద ఉన్న దాసాంజనేయ స్వామి, ఇరుసుమండలోని భక్తాంజనే యస్వామి, వ్యాఘ్రేశ్వరంలో ఆంజనేయ స్వామి, గంగల కుర్రు, చిరతపూడి, తొండవరంలతో పాటు పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించి అన్నసమారాధ నలు చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

**వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

**ఆలమూరు:** మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తు లతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేశారు. ఆయా దేవా లయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదా లను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశా లను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వ హించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తు లను అలరించాయి.

### మహిళ హత్య కేసుపై ఆందోళన

**ఆత్రేయపురం:** గ్రామంలోని మహిళ హత్య కేసులో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం సాయంత్రం కొంత మంది గ్రామస్తులు ఈ కేసులో పలువురు వ్యక్తులు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. దీనిపై విచారణ నిర్వహించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఐ రజనీకుమార్ విచారణ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సై సీహెచ్ సుధాకర్ విచా రణ కొనసాగుతుందని పోస్టుమార్టం రిపోర్టు అందిన తరువాత పూర్తి వివరాలు వెల్లడవుతాయన్నారు. అలాగే దోషులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు చేపడ తామని ఎస్సై హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.